# ప్రజాదీవెనతో ముందుకు సాగుతా..



గట్టుకాడిపల్లి వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- వనపర్తి వాసులు విజ్ఞానవంతులు
- మళ్లీ ఆశీర్వదించండి.. రెట్టింపు అభివృద్ధి చేస్తా..
- వెయ్యి జాకీలు పెట్టినా కాంగ్రెస్ లేవదు
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి
- నామినేషన్‌దాఖలు చేసిన మంత్రి
- గులాబీమయమైన వనపర్తి

వనపర్తి, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): వనపర్తి వాసులు వివేకవంతులు, విజ్ఞానవంతులని మరోసారి ప్రజా దీవెనలతోనే ముందుకు సాగుతానని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి నిరంజన్‌రెడ్డి , మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో భారీగా తరలివచ్చిన కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. వనపర్తిని సాగునీరు, విద్య, వైద్యంతో పాటు అనేకరంగాల్లో అభివృద్ధి చేశానని, తను చేసిదంతా మీ కండ్ల ఎదుట కదలాడుతుందని, ఆ విశ్వాసంతోనే మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని మంత్రి కోరారు. రాష్ట్రంలోనే వనపర్తికి గుర్తింపు వచ్చేలా అభివృద్ధి చేశానని మంత్రి పేర్కొన్నారు. ఈతరం ప్రజలు, విద్యార్థుల అభ్యున్నతి కోసం అనేక పనులు చేపట్టామని, ఇంజినీరింగ్, మెడికల్, వ్యవసాయ, నర్సింగ్ కళాశాలతో పాటు వాళ్ల భవిష్యత్ కోసమే అనేక విద్యాసంస్థలు వనపర్తికి తీసుకొచ్చామన్నారు. తాను చేసిన అభివృద్ధిని చూసి ఎన్నికల్లో నిర్ణయం తీసుకోవాలని మంత్రి కోరారు. 2014ఎన్నికల్లో ఓటమి చెందినప్పుడు, 2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోనే భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించినప్పుడు కూడా తాను సహనంతో పని చేశానే తప్పా ఉలిక్కి పడలేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తెచ్చుకున్న నియోజకవర్గంగా వనపర్తికి పేరుందని, 40వేల మందికి ఆసరా పింఛన్లు అందుతున్నాయని గుర్తుచేశారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నామని మంత్రి సింగిరెడ్డి చెప్పారు. సురవరం ప్రతాపరెడ్డిలాంటి మ హనీయులను ఎన్నుకున్న తర్వాత ఉన్నత విద్యావంతులను వనపర్తి ప్రజలు ఎమ్మెల్యేలుగా ఎన్నుకుంటున్నారని, రాష్ట్రంలోనే వనపర్తి అగ్రశ్రేణి ని యోజకవర్గాల్లో ఒకటిగా నిలబెట్టానని మంత్రి చెప్పారు.

**వెయ్యి జాకీలు పెట్టినా..**

రాష్ట్రం, దేశంలో కానీ వెయ్యి జాకీలు పెట్టినా కాంగ్రెస్ లేవలేని పరిస్థితిలో ఉందని మంత్రి నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 40 ఏండ్లు కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన చిన్నారెడ్డి ఆపార్టీకి పనికి రాలేదని, 40రోజుల కిందట పార్టీలో చేరి పైరవీ చేసుకున్న వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని చేసిందన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఏడు స్థానాల్లో ఐదుగురు అభ్యర్థులు బీఆర్ఎస్ నుంచి వెళ్లినవారేనన్నారు. బీఆర్‌ఎస్ బీఫారంతో గెలుపొంది పదవికి రాజీనామా చేయనోళ్లు అడ్డం..నిలువుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎన్నిక కావచ్చని, ప్రజలు ఓటు వేసేటప్పుడు వారి అర్హతలను గమనించి ఓటు వేయాలన్నారు. బట్టకాల్చి మీద వేసే వాళ్లు చాలా మంది ఉన్నారని, తనకంటే ఎక్కువ పనిచేసే వాళ్లు ఎవరైనా ఉంటే పరిశీలించాలని మంత్రి పేర్కొన్నారు.

**గులాబీమయమైన వనపర్తి..**

మంత్రి నిరంజన్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా వనపర్తి పట్టణం మరోసారి గులాబీమయమైంది. పట్టణంలోని రోడ్లన్నీ గులాబీ జెండాలతో నిండాయి. ప్రధాన కూడళ్లు, రహదారులు గు లాబీ ఫ్లెక్సీలు, జెండాలతో రెపరెపలాడాయి. వివిధ మండలాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు తరలివ చ్చారు. సింగిరెడ్డి ఇంటి నుంచి ర్యాలీగా మర్రికుంట వరకు కార్యకర్తలు ప్రదర్శనలు చేస్తూ వెళ్లారు. ఎటుచూసినా బీఆర్‌ఎస్ కార్యకర్తలలో రోడ్లన్నీ నిండిపోయాయి. జెండాలు చేతపట్టుకుని కార్యకర్తలు జై తెలంగాణ నినాదాలను మా ర్మోగించారు. గంగిరెద్దులతో విన్యాసాలు, డప్పుల, పటాకుల మోతలు, భాజా భజంత్రీలతో పట్టణ వీధులు పులకించాయి.



నామినేషన్ వేయడానికి ఎండ్ల బండిపై ర్యాలీగా వెళ్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**అట్టహాసంగా నామినేషన్ దాఖలు**

మంత్రి నిరంజన్‌రెడ్డి అట్టహాసంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖ లు చేశారు. ముందుగా ఖిల్లాఘణపురం మండలం గట్టుకాడిపల్లి వేంకటేశ్వర ఆలయంలో కుటుంబసమేతంగా ప్రత్యేక పూ జలు చేసి వనపర్తికి చేరుకున్నారు. ఇంటి నుంచి భారీ ర్యాలీగా కార్యకర్తలు వెంటరాగా, ఎద్దుల బండిపై మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి కలెక్టరేట్ వరకు అట్టహాసంగా వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరుపతిరావుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ దాఖలులో మంత్రి వెంట జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ని యోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూ రు ప్రమోద్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ లక్ష్మయ్య, శిక్షణా తరగతుల చైర్మన్ పురుషోత్తం రెడ్డి, గొర్రెల కాపరుల సంఘం జిల్లా చైర్మన్ కురుమూర్తి యాదవ్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, న్యాయవాది చంద్రశేఖర్ రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, ఎంపీపీ కృష్ణానాయక్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పలువురు నాయకులు ఉన్నారు.



మంత్రి నామినేషన్‌కు భారీ తరలివస్తున్న పార్టీశ్రేణులు

# బీఆర్‌ఎస్‌తోనే భరోసా



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంత్రి నామినేషన్‌కు భారీగా హాజరైన జనం



శంఖం పూరిస్తున్న ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే నష్టపోతాం
- ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- సర్వమత పూజలతో నామినేషన్ దాఖలు
- గులాబీమయంగా మారిన పాలమూరు

మహబూబ్‌నగర్, నవంబర్ 9 : మహబూబ్ నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జనసందోహం మధ్య గురువారం నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం నుంచి న్యూటౌన్, మెట్టుగడ్డ, రైల్వేస్టేషన్ చౌరస్తాతో పాటు ప్రధాన రోడ్డు గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ సమీపంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ పత్రంతో బయలు దేరారు. అర్చకుల వేదమంత్రాలతో మంత్రి సతిమణి శారద, కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తల్లిదండ్రుల చిత్రపటాల వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు శాంతమ్మ, నారాయణగౌడ్ సమాదుల వద్ద ఆశీర్వాదం తీసుకుకున్నారు. అనంతరం ఎంబీసీ చర్చిలో రెవరన్ వరప్రసాద్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యకర్తలతో కలిసి మంత్రి ప్రత్యేకంగా డాన్స్ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ షాషాబ్‌గుట్ట దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షాఖాద్రీని కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకొని వేలాది మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి టీకప్ చౌరస్తా నుంచి బస్టాండ్ మీదుగా నామినేషన్ వేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నేత సయ్యద్ ఇబ్రా హీం, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులుతో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అనీల్‌కుమార్‌కు అందజేశారు.



తల్లిదండ్రుల సమాధి వద్ద పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**సేవకుడిలా పనిచేస్తా..**

ప్రజలకు మంచి చేయాలన్న తపన కాంగ్రెస్, బీజేపోళ్లకు లేదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కులమతాలకు అతీతంగా అన్నివర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి చేస్తున్నదన్నారు. రైతులకు మంచి చేయాలనే తపన ప్రతిక్షణం సీఎం కేసీఆర్‌కు ఉందని, మహబూబ్‌నగర్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిపక్షాలు దిమ్మతిరిగేలా లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. పదేండ్లలో ఊహించని అభివృద్ధి చేశామన్నారు. మహబూబ్‌నగర్‌లో వెయ్యి పడకల సూపర్‌స్పెషాలిటీ దవాఖాన, ఐటీ పార్కు, 26 ఎకరాల్లో జంగల్ సఫారీ పార్కు, 2,087 ఎకరాల్లో కేసీఆర్ ఎకో పార్కు, బైపాస్ రోడ్డు, మినీ ట్యాంక్‌బండ్ ఇలా చెప్పుకుంటేపోతే అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ జాబేర్ బిన్ సయ్యద్, ఎంఐఎం యువత అధ్యక్షుడు జాకీర్ అడ్వకేట్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేశ్ తదితరులున్నారు.